క్లుప్తంగా

ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరిన శ్రేణులతో ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటమే తరువాయి బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో అధికార కాంగ్రెస్‌లోకి వలసలు మొదలయ్యాయి. వేమనపల్లి మండలానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు సోమవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. వేమనపల్లి మాజీ జెడ్పీటీసీ రుద్రభట్ల సంతోష్‌కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సాబీర్ అలీ ఆధ్వర్యంలో దాదాపు 400మంది బీఆర్‌ఎస్ శ్రేణులు ఆ పార్టీని వీడగా, వీరికి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి లాంఛనంగా ఆహ్వానించారు. బీఆ ర్‌ఎస్ నాయకుడు ఉప్పలపు సాయి పక్షాన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వచ్చే స్థానిక ఎన్నికల్లో పాత, కొత్తనాయకులంతా కలిసికట్టుగా పనిచేసి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రామ్‌లీల మహోత్సవాన్ని విజయవంతం చేయండి

నస్పూర్: ఈ నెల 2న విజయదశమి పురస్కరించుకొని హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే రామ్‌లీల మహోత్సవాన్ని విజయవంతం చేయాలని హిందూ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు చుంచు రాజ్‌కిరణ్ కోరారు. సోమవారం ఆయన నాయకులతో కలిసి నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. న్యూ నాగార్జునా కాలనీలోని ప్రాణహిత స్టేడియంలో ఈ నెల 2న సాయంత్రం 4గంటలకు నిర్వహించే రామ్‌లీల మహోత్సవంలో భాగంగా సప్తవ్యసన దహన కార్యాక్రమం నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం జమ్మిపూజ నిర్వహించి అలాయ్ బలాయ్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనాలన్నారు. సమావేశంలో నస్పూర్ అధ్యక్షుడు ఎర్ర తిరుపతి, సభ్యులు కటుకూరి తిరుపతి, బొలిశెట్టి మల్లేశ్, పేర దివ్య, తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతకు పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ

భీమిని/కోటపల్లి/చెన్నూర్: దసరా నవరాత్రులను పురస్కరించుకుని కోటపల్లి మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన దుర్గామాత అమ్మవార్లను సోమవారం మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కన్నెపల్లి మండలంలోని రెబ్బెన గ్రామంలో శ్రీ రామలింగేశ్వర ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గామాతకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. చెన్నూర్ బట్టిగూడెం లక్ష్మీదేవర ఆలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద మహిళలు అర్చకులు సత్యమూర్తి శర్మ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

వేమనపల్లి తహసీల్దార్‌గా సాయిబాబా

వేమనపల్లి: వేమనపల్లి మండలానికి నాలుగు నెలల్లో నలుగురు తహసీల్దార్‌లు విధులు నిర్వర్తించారు. నాలుగు నెలల క్రితం ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన కే.రమేష్ బదిలీపై వెళ్లగా దండేపల్లి నుంచి వచ్చిన సంధ్యారాణి విధుల్లో చేరారు. ఆమె మూడు నెలలు తహసీల్దార్‌గా పనిచేసి, తన సొంత జిల్లా ఆదిలాబాద్‌కు స్వాజ్ బదిలీపై వెళ్లిపోయారు. కుమురంభీం జిల్లా కౌటాల నుంచి వచ్చిన పుష్పలత 28రోజులు పనిచేసి జిల్లా కేంద్రానికి బదిలీపై వెళ్లారు. గత ఆరు సం.ల క్రితం మండల తహసీల్దార్‌గా పనిచేసిన సాయిబాబా రెండోసారి మండలానికి తహసీల్దార్‌గా బదిలీ పై వచ్చి సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

జాగ్రత్తలు పాటించాలి

శ్రీరాంపూర్: గుండె జబ్బులు రాకుండా ముందస్తు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా సోమవారం శ్రీరాంపూర్‌లోని ఆర్కే 8 డిస్పెన్సర్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గుండె జబ్బుల నివారణ చర్యలకు సంబంధించిన కరపత్రాలను అధికారులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, డిప్యూటీ చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ బాబు, వైద్యులు లోకనాథ్ రెడ్డి, సాయి, నిఖిత, పింకీ, ఫిట్ సెక్రెటరీ విజయలక్ష్మి పాల్గొన్నారు.



భీమారం: బస్టాండ్ సమీపంలో బతుకమ్మ వేడుకలు



లక్సెట్టిపేట: కన్యకాపరమేశ్వరి ఆలయంలో...



రామకృష్ణాపూర్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు





మందమర్రిరూరల్: ఆదిల్‌పేట్‌లో బతుకమ్మ వేడుకలు



మంచిర్యాలఅర్బన్: బతుకమ్మతో యువతి



బతుకమ్మలతో యువతులు



మంచిర్యాలఅర్బన్: బతుకమ్మలతో యువతులు

సద్దుల సంబురం

సాక్షి నెట్‌వర్క్: ఒక్కేసి పువ్వేసి చందమామ.. ఒక జాము ఆయే చందమామ.. చిత్తూ చిత్తూల బొమ్మ.. శివుడీ ముద్దుల గుమ్మా... బతుకమ్మ..బతుకమ్మ ఉయ్యాలో... అంటూ బతుకమ్మ ఆట, పాటలతో సద్దుల బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా సాగాయి. జిల్లా వ్యాప్తంగా బతుకమ్మను కీర్తిస్తూ ఆడపడుచులు సోమవారం సద్దుల బతుకమ్మ పర్వదినాన్ని నిర్వహించుకున్నారు. సంస్కృతి, సంప్రదాయాలతో కూడిన నూతన వస్త్రాలు ధరించారు. 9 రోజుల పాటు గౌరమ్మను తీరొక్క పూలతో బతుకమ్మగా పేర్చి ఆటపాటలతో కొలిచారు. చివరి రోజు సద్దుల బతుకమ్మ సందర్భంగా అర్ధరాత్రి వరకు మహిళలు, యువతులు, చిన్నారులు ఆడిపాడారు. అనంతరం శోభాయాత్రగా వెళ్లి స్థానిక చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. మహిళలు ఇస్తినమ్మ వాయినం.. పుచ్చుకుంటినమ్మ వాయినం అంటూ పిండి(సత్తులు) పదార్థాలను ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకున్నారు. అధికారులు ఏర్పాట్లు చేయగా, పోలీసులు ఎలాంటి ఘటనలు జరగకుండా బందోబస్తు చేపట్టారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



బెల్లంపల్లి: అంబేద్కర్ నగర్‌లో...



మంచిర్యాలఅర్బన్: హమాలివాడలో...



నస్పూర్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



జైపూర్: వేంకటేశ్వర స్వామి టెంపుల్ వద్ద...



చెన్నూర్‌రూరల్: లంబడిపల్లిలో...



కోటపల్లి: రాంపూర్‌లో బతుకమ్మ వేడుకలు



జన్నారం: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



భీమిని: బాబాపూర్‌లో బతుకమ్మల వద్ద మహిళలు



దండేపల్లి: చింతపల్లిలో బతుకమ్మలతో బాలికలు



మంచిర్యాలరూరల్(హాజీపూర్): గుడిపేటలో...



నెన్నెల: నెన్నెలలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



శ్రీరాంపూర్: మహాబతుకమ్మకు జీఎం దంపతుల స్వాగతం

యూరియా అక్రమ తరలింపుపై విచారణ చేపట్టాలి

వేమనపల్లి: మండలానికి ప్రభుత్వం కేటాయిస్తున్న యూరియా బస్తాల అక్రమ తరలింపుపై సమగ్ర విచారణ జరిపించాలని సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ ఆధ్వర్యంలో ఏవో వీరన్నకు ఫిర్యాదు చేశారు. నీల్వాయిలో ఉన్న పీఏసీఎస్ కార్యాలయానికి యూరియా బస్తాలు రాగా, మార్గ మధ్యలో లారీ ఆపి ట్రాక్టర్లో ఎక్కించి కొందరు అక్రమంగా తరలించారని ఆరోపించారు. విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'సమాచారం లేకుండానే అమ్మకం'

చెన్నూర్‌రూరల్: మండలంలోని పొగెపల్లిలో ఓ డీలరు దుకాణానికి ఆదివారం 222యూరియా బస్తాలు వచ్చాయి. వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం ఇవ్వకుండానే 120బస్తాలను అదే రోజు రాత్రి రైతులకు విక్రయించినట్లు సమాచారం . ఈ విషయం వ్యవసాయశాఖ దృష్టికి వచ్చిందని ఏవో యామిని తెలిపారు. మిగిలిన 100బస్తాలను సోమవారం రైతులకు పంపిణీ చేయించామని, అధికారులకు సమాచారం లేకుండా బస్తాలు విక్రయించినందుకు డీలర్‌కు మెమో ఇచ్చినట్లు ఆమె పేర్కొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో విజయదశమి

బెల్లంపల్లి: బెల్లంపల్లి మినీ వైశ్య భవన్‌లో సోమవారం విజయదశమి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా భారతమాత, దివంగత ఆర్‌ఎస్‌ఎస్ ప్రముఖల చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ సహప్రాంత ప్రచారక్ ప్రభుకుమార్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మేడి పున్నంచంద్ తదితరులు ఉన్నారు.

బట్వాన్‌పల్లిలో భూ బాధితుల ఆందోళన

బెల్లంపల్లిరూరల్: భూమి అమ్ముతామని చెప్పి బాధితుల నుంచి డబ్బులు వసూలు చేసి భూమిని బాధితులకు రిజిస్ట్రేషన్ చేయించకపోవడంతో బాధితులు ఆ వ్యక్తుల ఇంటి ఎదుట నిరసన చేపట్టిన ఘటన బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని దుబ్బపల్లికి చెందిన బల్లాని గంగరాజు, పూజారి సమ్మయ్య, పూజారి నగేష్, శ్యామ్, గోపి, రాములకు బట్వాన్‌పల్లి గ్రామానికి చెందిన రామటెంకి శివ, రామటెంకి హరికష్ణ, పాత మంచిర్యాలకు చెందిన బొలిశెట్టి భీమయ్య, రాంపూర్‌కు చెందిన మొండి, బుధాకుర్దుకు చెందిన లగిశెట్టి సత్యానారాయణలు తాండూర్ మండలం అచ్చలాపూర్ గ్రామ శివారులోని సర్వే నంబర్ 340/1, 341 /బిలలో 12ఎకరాల భూమి అమ్మనున్నట్లు చెప్పారు.



నిరసన తెలుపుతున్న బాధితులు

దీంతో బల్లని గంగరాజు రూ.80లక్షలకు బేరాన్ని కుదుర్చుకొని జూలై 17న రూ.10లక్షలు బయానగా, జూలై 27న రూ.10లక్షలు, మరొక సమయంలో మొత్తంగా రూ.45లక్షల వరకు శివ, హరికష్ణలకు ముట్టజెప్పినట్టు బాధితులు తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 20న భూమి రిజిస్ట్రేషన్ చేయించాల్సి ఉండగా శివ, హరికృష్ణలు స్పందించడం లేదని గంగరాజు తెలిపారు. దీంతో అనుమానం వచ్చినా, తాము ఆ భూమి పత్రాలు నకిలీవని, నకిలీ భూ పత్రాలతో తాము మోసపోయామని గ్రహించిన బాధితులు ఆదివారం అర్ధరాత్రి మోసం చేసిన వ్యక్తులు బట్వాన్‌పల్లిలోని శివ, హరికష్ణకు ఇంటికి చేరుకొని నిరసన చేపట్టారు. సోమవారం ఆ వ్యక్తుల ఇంటి ఎదుట వంట చేసుకొని, పందులతో ఆందోళన నిర్వహించారు. తమను నకిలీ పత్రాలతో మోసం చేసారని, వారు తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని నిరసన చేపట్టారు. న్యాయం జరిగే వరకు అక్కడి నుంచి కదిలేదని భీష్మించుకుని కూర్చుకున్నారు. బాధితులతో పాటు వారి బంధువులు వారికి మద్దతుగా నిలిచారు. ఎలాంటి గొడవలు జరగకుండా తాళ్లగురిజాల పోలీసులు గస్తీ కాస్తున్నారు. ఈ ఘటన బట్వాన్‌పల్లితో పాటు మండలంలో చర్చనీయాంశంగా మారింది.

3న దసరా సెలవు ఇవ్వాలి

కాసిపేట/మందమర్రిరూరల్/శ్రీరాంపూర్: సింగరేణిలో అక్టోబర్ 3న దసరా సెలవు ఇవ్వాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం అన్ని గనులు, డిపార్టుమెంట్లపై అధికారులను కలిసి వినతిపత్రాలు సమర్పించారు. మందమర్రిలో ఏరియా జీఎం రాధాకృష్ణకు, కాసిపేటలో గని మేనేజర్ సతీశ్‌కుమార్‌కు వినతిపత్రాలు ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచీ సెక్రెటరీ ఎస్కే బాజీసైదా, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, జీఎం చర్చల ప్రతినిధులు, మందమర్రిలో యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, కాసిపేటలో ఏఐటీయూసీ సెంట్రల్ కార్యదర్శి అక్బర్ అలీ, బెల్లంపల్లి బ్రాంచి కోశాధికారి నాగేశ్వరరావు, ఫిట్ కార్యదర్శి మినుగు లక్ష్మీనారాయణ, నాయకులు రాజేందర్, సురేష్, రంజిత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నేతలు

గుర్తింపు సంఘంతో జీఎం స్ట్రక్చర్ మీటింగ్



సమస్యలు తెలుసుకుంటున్న ఏరియా జీఎం

మందమర్రిరూరల్: ఏరియాలోని జీఎం ఆఫీస్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో సింగరేణి గుర్తింపు కార్మిక సంఘమైన ఏఐటీయూసీ నాయకులతో సోమవారం జీఎం రాధాకృష్ణ ఆధ్వర్యంలో స్ట్రక్చర్ మీటింగ్ జరిగింది. ఈ మీటింగ్‌లో సంఘం నాయకులు ఏరియా కార్మిక సమస్యలను జీఎం దృష్టికి తీసుకురాగా, తమ పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తానని, మిగిలిన సమస్యలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని జీఎం తెలిపారు. ఏరియాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనకు సహకరించాలని యూనియన్ నాయకులు జీఎం కోరారు. ఈ మీటింగ్‌లో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు, ఏరియా అధికారులు ఉన్నారు.